చల్లబడ్డ వాతావరణం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో విజయనగర వాసులు ఊపిరి పీల్చుకున్నారు. శనివారం వరకు నిప్పుల కుంపటి మాదిరిగా ఎండలు మండడంతో ఉక్కిరిబిక్కిరైన విషయం తెలిసిందే. వేడికి తోడు విద్యుత్ కోతలు ఉండటం, ఉక్క పోతతో నగర వాసులు ఇబ్బంది పడ్డారు. గత రెండు రోజులుగా వాతావరణ చల్లబడటం, ఆదివారం రాత్రి వర్షం ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. జనం ఇళ్లల్లోంచి బయటకొచ్చి సేదతీరారు. ఉష్ణోగ్రతలు సైతం అదుపులోకి వచ్చినట్లు విశాఖపట్నం వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రుతు పవనాలు త్వరలోనే రాష్ట్రమంతటా విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది వర్షాలకు లోటు ఉండదని అధికారులు చెబుతున్నారు.

నేడే ప్రజా తీర్పు

- ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం
- 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం
- పార్లమెంటు బరిలో 15, అసెంబ్లీకి 77 మంది పోటీ

ప్రజలంతా ఎంతో ఉత్కంఠతో ఎదురుచూస్తున్న ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధమైంది. మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఆమె సోమవారం సాయంత్రం లెండి ఇంజనీరింగ్ కళాశాల, జెఎన్‌టియుజివిలోని ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించారు. జిల్లా ఎన్నికల పరిశీలకులు సైతం కౌంటింగ్‌కు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఉదయం 8 గంటలకు మొదట పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రారంభమవుతుంది. అరగంట తరువాత ఇవిఎం ఓట్ల లెక్కింపు మొదలవుతుంది.

– ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి, కోట

కౌంటింగ్‌కు సిద్ధం చేసిన టేబుళ్లు

బరిలో 92 మంది అభ్యర్థులు

మే 13న జరిగిన ఎన్నికల్లో విజయగనరం జిల్లాలో మొత్తం 92 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. విజయనగరం పార్లమెంటు స్థానంలో 15 మంది పోటీ చేయగా, జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 77 మంది పోటీ పడ్డారు. విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గంలో 15 మంది, ఎస్.కోట నియోజకవర్గంలో 12మంది, నెల్లిమర్లలో 12 మంది, గజపతినగరంలో 13 మంది, చీపురుపల్లిలో 7 గురు, రాజాంలో 10 మంది, బొబ్బిలిలో 8 మంది అభ్యర్థులు పోటీ చేశారు.

పార్లమెంటుకు 81.05 శాతం ఓట్లు నమోదు

గత నెలలో జరిగిన ఎన్నికల్లో విజయనగరం పార్లమెంటు స్థానంలో మొత్తం 81.05 శాతం ఓటింగ్ నమోదయ్యింది. ఎచ్చెర్లలో 83.28 శాతం, రాజాంలో76 శాతం, బొబ్బిలిలో 80.34 శాతం, చీపురుపల్లిలో83.48 శాతం, గజపతినగరంలో 86.44 శాతం, నెల్లిమర్లలో 88.25 శాతం, విజయనగరంలో 71.84 ఓట్ల శాతం నమోదయ్యింది. అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు కలిపి సగటున 81.33 ఓట్ల శాతం నమోదయ్యింది. రాజాంలో 76 శాతం, బొబ్బిలిలో 80.34 శాతం, చీపురుపల్లిలో 83.48 శాతం, గజపతినగరంలో 86.44 శాతం, నెల్లిమర్లలో 88.25 శాతం, విజయనగరంలో 71.84 శాతం, శంగవరపుకోటలో85.45 శాతం ఓట్లు నమోదయ్యాయి.

రెండు చోట్ల లెక్కింపు కేంద్రాలు

జిల్లాలో అసెంబ్లీ, పార్లమెంట్ ఓట్ల లెక్కింపు కోసం రెండు కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు. లెండి ఇంజినీరింగ్ కళాశాలలో నెల్లిమర్ల, రాజాం, చీపురుపల్లి, ఎస్.కోట, గజపతినగరం నియోజకవర్గాలకు సంబంధించి, అసెంబ్లీ పార్లమెంట్ సెగ్మెంట్లకు వేర్వేరుగా లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశారు. విజయనగరం, బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గాలకు, పార్లమెంట్ సెగ్మెంట్లకు సంబంధించిన కౌంటింగ్‌కు జెఎన్‌టియు గురజాడ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేశారు.

14 టేబుళ్లు ఏర్పాటు

అసెంబ్లీ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం ఒక్కో కేంద్రంలో నాలుగు టేబుళ్ల ను ఏర్పాటు చేశారు. అన్ని నియోజక వర్గాల పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం లెండి కళాశాల కేంద్రంలో 20 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఇవిఎంల ఓట్ల లెక్కింపు కేంద్రంలో వరుసకు ఏడు చొప్పున మొత్తం 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేశారు. ఈటిపిబి ఓట్ల లెక్కింపునకు అదే హాలులో మూడు టేబుళ్లను ఏర్పాటు చేశారు.

ఉదయం 8 గంటలకే ప్రారంభం

మంగళవారం ఉదయం 8 గంటలకే ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుంది. మొదట పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు జరుగుతుంది, అరగంట తర్వాత ఇవిఎంల లెక్కింపు ప్రారంభం అవుతుంది. అన్నిచోట్లా అసెంబ్లీ, పార్లమెంట్ ఓట్ల కౌంటింగ్‌కు వేర్వేరుగా లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశారు. విజయనగరం పార్లమెంటు స్థానం పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో (ఎచ్చెర్ల తో సహా) పార్లమెంటుకు పోలైన పోస్టల్ బ్యాలెట్లన్నీ లెండి ఇంజనీరింగ్ కళాశాలలోనే లెక్కిస్తారు.

జిల్లాలో 144 సెక్షన్ అమలు

జిల్లా వ్యాప్తంగా 144వ సెక్షన్ అమలులో ఉంటుంది. లెక్కింపు కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు, నిఘా ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు,రెండు డ్రోన్లు నిరంతర నిఘా ఉంటుంది. డ్రోన్లు, ఎగిరే పరికరాలు ఆ ప్రాంతంలో ఎగరవేయకుండా, లెక్కింపు కేంద్రాలను నో ఫ్లై జోన్ గాప్రకటించారు. ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యాక కూడా ఊరేగింపులు, ర్యాలీలకు అనుమతి లేదు.

972 మంది కౌంటింగ్ సిబ్బంది

రాండమైజేషన్ ద్వారా మొత్తం 972మందిని కౌంటింగ్ కోసం కేటాయించగా,వీరిలో కౌంటింగ్ సూపర్వైజర్లు 289 మంది, కౌంటింగ్ అసిస్టెంట్లు 340 మంది, మైక్రో అబ్జర్వర్లు 343 మందిని నియమించారు. ఇవిఎంల కౌంటింగ్ కోసం ప్రతి టేబుల్ వద్దా ఒక కౌంటింగ్ సూపర్వైజర్ (గెజిటెడ్), ఒక కౌంటింగ్ అసిస్టెంట్ , ఒక కౌంటింగ్ స్టాఫ్, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారు. పోస్టల్ బాలెట్ కౌంటింగ్ కోసం ప్రతీ టేబుల్ వద్దా ఒక సహాయ రిటర్నింగ్ అధికారి, ఒక కౌంటింగ్ సూపర్ వైజర్ (గెజిటెడ్), ఇద్దరు కౌంటింగ్ అధికారులు (గెజిటెడ్), ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారు.

పరిశీలించనున్న ఏడుగురు అబ్జర్వర్లు

కౌంటింగ్‌ను పరిశీలించడానికి ఏడుగురు పరిశీలకులు నియమితులయ్యారు. వీరంతా లెక్కింపు కేంద్రాల్లో ఉండి ఈప్రక్రియను మొత్తం పరిశీలిస్తారు. విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గానికి హనీష్ చాబ్రా, శృంగవరపుకోటకు సీతారామ్ జాట్, నెల్లిమర్ల డాక్టర్ డెబజిత్ ఖనికర్, చీపురుపల్లికి అబ్దుర్ రకీబ్ షేక్, గజపతినగరానికి స్నేహాల్ ప్రతాప్ భోస్లే, బొబ్బిలికి అరవింద్ కుమార్ పాండే, రాజాం నియోజకవర్గానికి అతుల్ కుమార్ నియమితులయ్యారు.

జిల్లాలో 19738 పోస్టల్ బ్యాలెట్లు

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల్లో మొత్తం 19738 పోస్టల్ బ్యాలెట్లు వచ్చాయి. వీటిలో రాజాం అసెంబ్లీ నియోజకవర్గంలో 3000 పోస్టల్ ఓట్లు, బొబ్బిలిలో 2917, చీపురుపల్లిలో 1851, గజపతినగరంలో 2408 , నెల్లిమర్లలో 2097, విజయనగరంలో 4838, శంగవరపుకోట నియోజకవర్గంలో 2627 పోస్టల్ ఓట్లు నమోదయ్యాయి. విజయనగరం పార్లమెంటు స్థానంలో మొత్తం 19545 పోస్టల్ ఓట్లు వచ్చాయి. సర్వీసు ఓటర్లుకు ఇచ్చిన ఈటిపిబి ఓట్లను మంగళవారం ఉదయం 8 గంటల వరకు స్వీకరించి లెక్కించనున్నారు.

నియోజకవర్గం	పోలింగ్‌స్టేషన్లు	రౌండ్లు
పార్వతీపురం	233	17
పాలకొండ	287	21
కురుపాం	268	20
సాలూరు	243	18
రాజాం	284	21
బొబ్బిలి	264	19
చీపురుపల్లి	257	19
గజపతినగరం	264	19
నెల్లిమర్ల	248	18
విజయనగరం	260	19
శృంగవరపుకోట	270	20

రౌండ్ల వారీగా ఓట్ల లెక్కింపు

అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి వేర్వేరుగా టేబుళ్లను ఏర్పాటుచేస్తారు. రాజాంకు 21 రౌండ్లు, బొబ్బిలికి 19, చీపురుపల్లి కి 19, గజపతినగరం కు 19, నెల్లిమర్ల కు 18, విజయనగరం కు 19, ఎస్.కోట కు 20 రౌండ్ల చొప్పున ఓట్ల లెక్కింపు జరుగుతుంది. అన్ని టేబుళ్ల వద్దా లెక్కింపు పూర్తయి, ఆ రౌండ్ ఫలితాలను ప్రకటించిన తరువాతే తదుపరి రౌండ్ ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. నెల్లిమర్ల నియోజకవర్గం నుంచి అధికారికంగా తొలి ఫలితం వెలువడే అవకాశం ఉంది.

కౌంటింగ్ నిర్వహణకు పటిష్ట భద్రత

ఏర్పాట్లను తనిఖీ చేసిన ఎస్‌పి ఎం.దీపిక

ఏర్పాట్లను తనిఖీ చేస్తున్న ఎస్‌పి దీపిక

ప్రజాశక్తి-విజయనగరంకోట

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో కౌంటింగ్ కేంద్రాల్లోకి ప్రవేశించే ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసి, గుర్తింపు కార్డు పరిశీలన చేసిన తరువాతనే అనుమతించాలని ఎస్‌పి ఎం.దీపిక అన్నారు. మొబైల్ ఫోన్స్, కాలిక్యులేటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను కౌంటింగ్ కేంద్రాలోకి అనుమతి లేదన్నారు. నిర్దేశించిన ప్రదేశాలలో మాత్రమే వాహనాలను క్రమపద్ధతిలో పార్కింగ్ చేయాంచాలని అధికారులను ఆదేశించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీగా బందోబస్తు విధులు నిర్వర్తించాలన్నారు. 144సెక్షన్ అమలులో ఉన్నందున నలుగురు కంటే ఎక్కువ మంది గుమిగూడి ఉండకుండా చూడాలన్నారు. విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించడానికి అనుమతులు లేవన్నారు. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా బందోబస్తులో పాల్గొన్న ప్రతి ఒక్కరూ బాధ్యతగా, అప్రమత్తతో విధులు నిర్వహించాలని అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. అనంతరం ఎస్పి కౌంటింగ్ చేపట్టే లెండి, జెఎన్‌టియు ఇంజినీరింగ్ కేంద్రాలను సందర్శించి, అధికారులకు, సిబ్బందికి కేటాయించిన ప్రాంతాల్లో వారు నిర్వహించాల్సిన విధులు, చేపట్టకూడని పనుల పట్ల అవగాన కల్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి అస్మా ఫర్హీన్, ట్రైనీ ఐపిఎస్ ఎం.జావళి అల్ఫాన్స్, పలువురు డిఎస్‌పిలు, సిఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

హోరాహోరీ పోటీలో గెలిచేదెవరో?

- సాలూరు, పార్వతీపురం, నెల్లిమర్ల ఫలితాలు మొదటగా వెలువడే అవకాశం
- రాజాం, పాలకొండ కాస్త ఆలస్యమే



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

నరాలు తెగేంత ఉత్కంఠతో ఎదురు చూస్తున్న ఎన్నికల ఫలితాలు నేడు వెలువడనున్నాయి. హోరా హోరీగా జరిగిన ఈ ఎన్నికల పోటీలో గెలిచేదెవరనేది కొన్ని గంటల్లోనే తేలనుంది. అభ్యర్థుల భవితవ్యంతో పాటు రాష్ట్రాన్ని ఏలే పార్టీ యేదో? జిల్లాలో ఏ పార్టీ ఎక్కువ సీట్లు గెలుచుకుంటుందో? మంగళవారం సాయంత్రానికి తేలనుంది. మధ్యాహ్నానికే ఫలితాలు ఓ కొలిక్కిరానున్నాయి. గత నెల 13న సార్వత్రిక ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. విజయనగరం జిల్లాలో 81.33శాతం. పార్వతీపురం మన్యం జిల్లాలో 77.10 శాతం ఓట్లు పోలయ్యాయి. విజయనగరం పార్లమెంట్ పరిధిలో 81.05శాతం, అరకు పార్లమెంట్ 73.68 శాతం ఓట్లు పోలయ్యాయి. మునుపెన్నడూ లేనంతగా ఓటర్లలో చైతన్యం కనిపించింది. ఓటింగ్‌లో మహిళలు ఎక్కువగానే పాల్గొన్నారు. జనాల్లో ఫలితాలపై ఇదే ఆసక్తి కనిపిస్తోంది. ఈనేపథ్యంలో ఇరు పార్టీలకు చెందిన అభ్యర్థులూ ఎవరి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. గెలుపు, ఓటమికి ప్రతి ఓటూ కీలకమే. అయినప్పటికీ ఈసారి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు క్రియాశీలక పాత్ర పోషించనున్నాయి. విజయనగరం జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల విధుల్లో పాల్గొన్న 21,836 మందికి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కల్పించగా, 19,738 ఓట్లు పోలయ్యాయి. మొత్తం పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో విజయనగరం నియోజకవర్గంలో అత్యధికంగా 4,944 ఓట్లు పోలయ్యాయి. ఈ ఓట్లు లెక్కింపుకోసం ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి నాలుగు టేబుళ్ళ, పార్లమెంట్ స్థానానికి 20టేబుళ్ల వేయనున్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ 17 నుంచి 21 రౌడ్ల వరకు ఉన్నాయి. దీన్ని బట్టి విజయనగరం జిల్లాలో నెల్లిమర్ల, మన్యం జిల్లాలో పార్వతీపురం, సాలూరు అసెంబ్లీ నియోజకవర్గాల ఫలితాలు మొదటగా వెలువడే అవకాశాలు ఉన్నాయి. రాజాం, పాలకొండ నియోజకవర్గాల్లో అత్యధికంగా 21 రౌండ్లు ఉండడంతో మిగిలిన వాటితో పోలిస్తే ఈ రెండు చోట్ల ఫలితాలు ఆలస్యంగా వచ్చే అవకాశం ఉంటుంది. కౌంటింగ్, అనంతరం ఫలితాల నేపథ్యంలో ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు, ముఖ్య కార్యకర్తలు సోమవారం సాయంత్రానికి విజయనగరం, పార్వతీపురం జిల్లా కేంద్రాలకు చేరుకున్నారు. ముఖ్యంగా టిడిపి కార్యాలయం (అశోక్ బంగ్లా)కు వచ్చిన కేడర్ సేదదీరేందుకు పార్టీ నాయకత్వం ఏర్పాట్లు చేసింది. అటు వైసిపిలోనూ ఇదే జోష్ కనిపిస్తోంది.

పోస్టల్ బ్యాలెట్ లెక్కింపులో నిబంధనలు పక్కాగా పాటించాలి

జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు లెండి ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతుందని, ఈ ప్రక్రియ మొత్తం సిసి టివిల కవరేజ్ , వీడియోగ్రఫి చేస్తామని విజయనగరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. రాజకీయ పార్టీలకు చెందిన ఏజెంట్లు వారికి కేటాయించిన స్థానాలలో కూర్చొని పరిశీలించడం తప్ప లెక్కింపుకు సంబంధించిన ఎలాంటి పనుల్లో పాల్గొనకూడదని స్పష్టం చేసారు. కలెక్టరేట్ సమావేశ మందిరం లో పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు సిబ్బందికి అవగాహనా కార్యక్రమాన్ని ఆర్ఒ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లెక్కింపు పూర్తి అయ్యేవరకు సిబ్బంది ఎవ్వరూ కూడా పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో ఎలాంటి సంభాషణలు జరపకూడదని, విరామానికి వెళ్ళినా తిరిగి మాట్లాడకుండా రావాలని, ఎన్నికల కోడ్ 6 వ తేదీ వరకు అమలులో ఉంటుందని తెలిపారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్‌లు, అభ్యర్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను కౌంటింగ్ కేంద్రాల వద్దకు తీసు రాకూడదని తెలిపారు. ఏజెంట్‌లు కూర్చునే కుర్చీలపై జాతీయ, రాష్ట్రస్థాయి గుర్తింపు పార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థులకు చెందిన ఏజెంట్లకు ప్రతి టేబుల్ వద్ద వరుస క్రమంలో సీటింగ్ ఏర్పాటు చేశామన్నారు.కౌంటింగ్ హాల్ వద్దకు వచ్చే ప్రతి ఒక్కరికి ఫోటో ఐడెంటిటీ తప్పనిసరి అని, లేకుంటే అనుమతించబడరని స్పష్టం చేసారు. పోస్టల్ బ్యాలెట్ లో ఓటు వేసిన వారి వివరాలను బయటకు వెల్లడి కాకుండా చూడ వలసిన బాధ్యత కౌంటింగ్ సిబ్బందిపై ఉందని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి గెజిటెడ్ సంతకం ఉంటే సరిపోతుందని, పేరు, డిజిగ్నేషన్ అవసరం లేదని తెలిపారు. ఓట్ల లెక్కింపు వేగంగా, ఖచ్చితంగా నిబంధనల ప్రకారంగా ఆలస్యం కాకుండా జరగాలని తెలిపారు.

సమావేశంలో ఎఆర్ఒ సుమబాల, మెప్మా పీడీ సుధాకర్, పోస్టల్ బ్యాలెట్ ఇన్‌ఛార్జి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల కోసం తప్పని తిప్పలు

పింఛను కోసం మరో మహిళ సాయంతో వచ్చిన వృద్ధురాలు

ప్రజాశక్తి-బొబ్బిలి

సామాజిక పింఛన్ల సొమ్ము బ్యాంకు ఖాతాలో జమ చేయడంతో విత్ డ్రా కోసం వృద్ధులు, వికలాంగులకు తిప్పలు తప్పడం లేదు. ఎన్నికలు ముగిసినా పింఛన్లు ఇంటింటికీ పంపిణీ చేయకుండా బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. పింఛను సొమ్ము విత్‌డ్రా చేసేందుకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు బ్యాంకులకు క్యూ కడుతున్నారు. ఉదయం నుంచి బ్యాంకుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. పింఛను సొమ్ము కోసం పింఛనుదారులు అధిక సంఖ్యలో చేరుకోవడంతో బ్యాంకులు కిక్కిరిస్తున్నాయి. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఇంటింటికీ పింఛను సొమ్ము పంపిణీ చేసేలా చూడాలని పింఛనుదారులు కోరుతున్నారు.

బ్యాంకు వద్ద పడిగాపులు కాస్తున్న పింఛనుదారులు

వృద్ధులను ఇబ్బందులు పెట్టడం అన్యాయం

సామాజిక పింఛన్లు బ్యాంకు ఖాతాల్లో వేసి వృద్ధులను ఇబ్బందులు పెట్టడం సరికాదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు అన్నారు. బ్యాంకు ఖాతాల్లో పింఛను సొమ్ము జమ చేయడంతో విత్ డ్రా చేసేందుకు పింఛనుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా పింఛన్లు బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం అన్యాయమని వాపోయారు. పింఛన్లు ఇంటింటికి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఇంటింటికీ పంపిణీ చేయాలి

సామాజిక పింఛన్లను సచివాలయ సిబ్బందితో ఇంటింటికీ పంపిణీ చేయాలని లోక్ సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్ డిమాండ్ చేశారు. పింఛన్ల కోసం బ్యాంకుల వద్ద వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

రఘురాజుపై అనర్హత వేటు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

విజయనగరం జిల్లాలోని ఎస్.కోట నియోజకవర్గానికి చెందిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుపై శాసనమండలి ఛైర్మన్ మోషేష్ రాజ్ సోమవారం అనర్హత వేటు వేసినట్లు ఉత్తర్వులు జారీ చేశారు. రెండు నెలల క్రితం ఎమ్మెల్సీ పదవికి అనర్హుడని కౌన్సిల్ నుంచి నోటీసులు జారీ చేసి మే 31న వివరణ ఇచ్చేందుకు కౌన్సిల్ కు రావాలని తెలియజేశారు. మీ భార్య పార్టీ మారినందున మిమ్మల్ని పదవికి అనర్హులుగా చేస్తున్నామని పేర్కొన్నారని తెలిపారు. గతంలో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేతో ఒక ఫంక్షన్‌కు హాజరయ్యారని, ఎమ్మెల్సీ పదవి తీసుకొని వైసిపికి దూరంగా ఉంటున్నారని ఆ నోటీసులో పేర్కొన్నారు.అయితే అనారోగ్య కారణాల ఆసుపత్రిలో ఉన్నందున మే 31న హాజరు కాలేకపోతున్నట్లు ఎమ్మెల్సీ రఘురాజు సమాధానం పంపారు. పార్టీ ఫిరాయించినన రఘురాజుపై చర్యలు తీసుకోవాలని వైసిపి విప్ విక్రాంత్ ఫిర్యాదు మేరకు శాసన మండలి నుంచి రఘురాజుకు అనర్హత వేటు వేసినట్లుగా పేర్కొన్నారు. ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, ఆయనకు టిక్కెట్ కేటాయించవద్దని ఎమ్మెల్సీ రఘురాజు పలుమార్లు పార్టీ దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా ఆయనకు టిక్కెట్ ఇస్తే రాజీనామా చేస్తామంటూ పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు సైతం రఘురాజు ప్రోత్సాహంతో ప్రకటించారు. అయినప్పటికీ అధిష్టానం కడుబండి శ్రీనివాసరావుకే టిక్కెట్ ఇవ్వడంతో రఘురాజు తన సతీమణిని టిడిపిలోకి పంపారు. ఈనేపథ్యంలోనే పార్టీ విప్ విక్రాంత్ ఎమ్మెల్సీపై అనర్హత వేటు వేయాలని చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు.

విద్యార్థినికి చేయూత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పదో తరగతి పరీక్షలలో 93 శాతం మార్కులు సాధించిన విద్యార్థినికి ఇంటర్ చదువుకునేందుకు 'జిల్లా ఆర్యవైశ్య మిత్రుల గ్రూప్' ఆర్థిక సహాయం చేసింది. సోమవారం స్థానిక శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయం ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో నగరానికి చెందిన కాసం భవ్యశ్రీకి ఇంటర్ కాలేజి ఫీజు నిమిత్తం రూ 30వేలు చెల్లించినట్లు సంఘం అధ్యక్షుడు ఆలవెల్లి శేఖర్ తెలియజేసారు. కార్యదర్శి డిమ్స్ రాజు మాట్లాడుతూ ముఖ్యంగా విద్య, వైద్యం, వివాహం కార్యక్రమాలకు గ్రూప్ ఆర్థిక సహాయం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో కోశాధికారి సముద్రాల నాగరాజు, పెంటపాటి కామరాజు, కంచర్ల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష పీడీ ఆకస్మిక పర్యటన

విద్యా కానుక స్టాక్ పాయింట్ పరిశీలన

విద్యాకానుక వివరాలను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాసరావు

ప్రజాశక్తి -పూసపాటిరేగ

సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు సోమవారం మండలంలో ఆకస్మికంగా పర్యటించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ విద్యా సంత్సరంలో విద్యార్థులకు అందజేయాల్సిన విద్యా కానుకల సామాగ్రిని ఆయన పరిశీలించారు. ముందుగా విద్యా కానుకలలో బ్యాగు నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఏయే తరగతులకు ఏయే టైటిల్స్ వచ్చాయో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు స్టాక్ పాయింట్‌లో ఈ సామాగ్రిని అమర్చే విధానాన్ని పరిశీలించారు. అనంతరం విద్యా కానుకలకు సంబదించి స్టాక్ రిజిస్టర్లను, రికార్డులను నిశితంగా పరిశీలించారు. స్టాక్ పాయింట్ నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెల జూన్ 12న పాఠశాలలు తెరిచిన రోజున విద్యార్థులందరికి విద్యా కానుకలో సూచించిన సామాగ్రి అంతా అందేటట్లు చర్యలు తీసుకోవాలని ఆయన జిల్లా విద్యాశాఖధికారి ఎన్. ప్రేమకుమార్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖధికారి కెవి రమణ, ఎంఇఒ బి.పాపినాయుడు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.శంకరరావు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బందికి సూచనలు చేస్తున్న రిటర్నింగ్ అధికారి సాయిశ్రీ

అన్ని జాగ్రత్తలతో ఓట్ల లెక్కింపు : ఆర్ఒ

ప్రజాశక్తి-బొబ్బిలి

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ చేపట్టాలని బొబ్బిలి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిశ్రీ. కౌంటింగ్ సిబ్బందికి తెలిపారు. జెఎన్‌టియులో బొబ్బిలి అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గ ఓట్ల లెక్కింపు నిర్వహించే సిబ్బందికి చివరి విడత శిక్షణను సోమవారం విజయనగరం ఎన్‌జిఒ హోంలో నిర్వహించారు. మాస్టర్ ట్రెయినీలు జెసి రాజు, ప్రవీణ్ కుమార్ కౌంటింగ్ సిబ్బందికి వివిధ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఆర్ఒలు త్రినాథరావు నాయుడు, రాజ్యలక్ష్మి, రాజారావు, సులోచనారాణి, హెచ్‌డిటి రెడ్డి సాయికృష్ణ, డిటిలు చిన్నారావు, సుబ్బారావు పాల్గొన్నారు.

హోటళ్లన్నీ హౌస్‌ఫుల్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తల దృష్టి అంతా ఆ రెండు కౌంటింగ్ కేంద్రాల వైపే ఉన్నాయి. మంగళవారం ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో వారంతా జిల్లా కేంద్రానికి చేరుకునేందుకు ఎవరి ఏర్పాట్లు వారు చేసుకున్నారు. గతంలో మాదిరి కౌంటింగ్ కేంద్రాల వద్దకు ఎవరూ రాకుండా పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడంతో వారంతా జిల్లా కేంద్రానికి చేరుకొని హోటళ్లలో బస చేసేందుకు ముందుగానే వాటికి బుక్ చేసుకున్నారు. 22 రోజులుగా ఫలితాల కోసం ఎదురు చూస్తున్న నాయకులు, కార్యకర్తలు అంతే ఉత్కంఠతో ఫలితాల కోసం చూస్తున్నారు. ఈనేపథ్యంలో 144 సెక్షన్ అమలుల్లో ఉండడంతో హోటళ్లలోనే ఉంటూ టివిల్లోనూ, తమ పార్టీ ఏజెంట్లకు ఫోన్లు చేసి వారి ద్వారా ఫలితాలు తెలుసుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈనేపథ్యంలో జిల్లా కేంద్రంలోని హోటళ్లు, లాడ్జిలు నిండిపోయాయి.

మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాలను డాక్టర్ సీతాలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సీతాలక్ష్మి మాట్లాడుతూ మలేరియా, డెంగీ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మలేరియాపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ కృపా, హెచ్‌వి.బేబిరాణి, సిబ్బంది పాల్గొన్నారు.

అలా చేస్తే చర్యలు తప్పవు

ప్రజాశక్తి-వేపాడ

ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కె.రాజేష్ హెచ్చరించారు. ఏ పార్టీకి చెందిన వారైనా గెలుపు ఓటములను పక్కనపెట్టి గ్రామాల్లో ఊరేగింపులు, మందుగుండు సామగ్రి కాల్చడం చేయకూడదని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోకతప్పదని చెప్పారు. ప్రధానంగా యువత ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనవద్దని, తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

కొనసాగుతున్న శిక్షణ శిబిరం

ప్రజాశక్తి-వేపాడ

వేపాడ శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో కొనసాగుతోంది. విద్యార్థులతో ప్రతిరోజూ వినూత్నమైన కార్యక్రమాలు నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి ఎం.చంద్రశేఖర్ తెలిపారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-వేపాడ

బక్కునాయుడుపేట వద్దనున్న ఆదర్శ పాఠశాలలో 7, 8, 9 తరగతుల మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ రావాడ ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల పదో తేదీలోపు పాఠశాలలో దరఖాస్తు అందించాలని తెలిపారు. 11న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు.

విద్యుత్తు కోతలను నివారించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

అప్రకటిత విద్యుత్తు కోతలను నివారించాలని పిసిసి అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో అధికారులను డిమాండ్ చేశారు. విద్యుత్తు కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. విద్యుత్తు బిల్లులు ఇష్టానుసారంగా పెంచిన పాలకులు నాణ్యమైన విద్యుత్తు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా చేయాలని కోరారు.

బస్‌పాసుల జారీకి కొత్త సాఫ్ట్‌వేర్

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఎపిఎస్‌ఆర్‌టిసిలో బస్‌పాసుల జారీ కోసం కొత్త సాఫ్ట్‌వేర్‌ను తీసుకొచ్చినట్లు డిపో మేనేజర్ కె.రమేష్ తెలిపారు. స్థానిక డిపోలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొత్త సాఫ్ట్‌వేర్ మైగ్రేషన్ కోసం ఈ నెల 6, 7 తేదీల్లో బస్‌పాస్ కౌంటర్లు మూసి వేస్తామని, 8 నుంచి యథాతథంగా కౌంటర్లు తెరుస్తామని చెప్పారు. ప్రయాణికులు సహకరించాలని కోరారు.

మానవాళి మనుగడకు మొక్కలు అవసరం

శృంగవరపుకోట : మానవాళి మనుగడకు మొక్కలు ఎంతో అవసరమని ఆర్‌టిసి డిపో మేనేజర్ కె.రమేష్ అన్నారు. డిపో మేనేజర్ కుమార్తె కె.దీక్షిత పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులంతా డిపో గ్యారేజీలో మొక్కలు నాటారు.

కళలకు దూరమవుతున్నారు

ప్రజాశక్తి-విజయనగరం కోట

నేటి విద్యార్థులు, బాలలు తెలుగు సాహిత్యానికి, జానపద కళలు సాహిత్యానికి దూరమవుతున్నారని బాలల గ్రంథాలయ నిర్వాహకులు, ఉత్తరాంధ్ర జానపద సాహిత్య పరిశోధకులు విశ్రాంతి లెక్చరర్ బద్రి కూర్మారావు అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో బాలల కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరం దాసన్నపేట లో బాలల గ్రంథాలయంలో ఈ వేసవి సెలవుల్లో ప్రత్యేకంగా పిల్లల్లో పుస్తకాన్ని చదివే అలవాటు చేద్దాం అనే కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి కళాకారులు పి.షణ్ముఖరావు, అరసం కార్యదర్శి రత్నాల బాలకృష్ణ, అధ్యక్షులు జిఎస్.చలం తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కూర్మారావు

ఇరువురిలోనూ గెలుపు ధీమా

ప్రజాశక్తి -విజయనగరం టౌన్

సార్వత్రిక ఎన్నికల పోరు ఉత్కంఠభరితంగా సాగింది. ఫలితాలు కోసం సుమారు 22రోజులు పాటు అభ్యర్థులు, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. వారి నిరీక్షణకు మంగళవారం తెరపడనుంది. విజయనగరం నియోజకవర్గంలో ఎన్నికల నోటిఫికేషన్ మొదలుకుని క్లైమాక్స్ సీన్ కౌంటింగ్ వరకు ఉత్కంఠ రాజ్యమేలుతోంది. రెండురోజుల క్రితం వెలువడిన ఎగ్జిట్‌పోల్స్‌లోనూ వైసిపి, ఎన్‌డిఎ కూటమి పోటీ పడ్డాయి. 2019 సార్వత్రిక ఎన్నికలకు మించి పోలింగ్ శాతం పెరిగిన నేపథ్యంలో పెరిగిన ఓటింగ్ చర్చనీయాంశంగా మారింది. పెరిగిన ఓటింగ్‌కు ఎవరి లాభిస్తుంది. ఎవరికి నష్టం కలుగుతుందో ఇప్పటికే అభ్యర్థులు అంచనాలు వేసుకొని ఒక కొలిక్కివచ్చారు. ప్రభుత్వ వ్యతిరేకత కారణంగానే ఓటింగ్ శాతం పెరిగిందని, కాబట్టి పెరిగిన ఓటు తమకే పడిందని టిడిపి, సంక్షేమ పథకాల అమలు కారణంగా మహిళలు, వృద్ధుల ఓట్లు తమవైపేనని వైసిపి నాయకులు చెబుతున్నారు. కొన్ని జాతీయ సర్వే సంస్థలు ఎన్‌డిఎ కూటమికి పట్టం కట్టగా, రాష్ట్రంలోని స్థానిక సర్వే సంస్థలు అధికార వైసిపి, కూటమికి సమానంగా మిశ్రమ ఫలితాలను వెలువరించడం గందరగోళానికి దారితీసింది. రాష్ట్రంలో అధికార పీఠాన్ని ఎవరు అధిష్ఠించనున్నారనే అంశంపై సందిగ్ధత కొనసాగుతోంది. నేడు ఈ సందిగ్ధత కు తెరపడనుంది.

స్పీడ్ తగ్గని బెట్టింగ్‌ల జోరు

ఎగ్జిట పోల్స్ అస్పష్టత కారణంగా బెట్టింగులు జోరందుకున్నాయి. ఇదే అదునుగా భావించిన బెట్టింగ్ రాయుళ్లకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. రాష్ట్రంలోని సుమారు 40 ఎగ్జిట్ పోల్స్ సంస్థలు వెలువరించిన ఫలితాల ఆధారంగా పెద్దఎత్తున బెట్టింగులకు పాల్పడుతున్నారు. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకత్వం బెట్టింగులకు పాల్పడవద్దని హెచ్చరిస్తున్నప్పటికీ ఎక్కడా వెనక్కి తగ్గుతున్న దాఖలాలు కనిపించడం లేదు. రూ.లక్షకు రూ. లక్షన్నర నుంచి రూ.మూడు లక్షల వరకు బెట్టింగుల కొనసాగుతూనే ఉండడం ఆందోళన కలిగిస్తోంది.



ఫలితాలు తెలుసుకునేందుకు అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్

టిడిపి కార్యాలయం వద్ద భారీ స్క్రీన్ ఏర్పాటు

ప్రజాశక్తి-విజయనగరం కోట

సార్వత్రిక ఎన్నికల ఫలితాలను వీక్షించేందుకు టిడిపి కార్యాలయం అశోక్ బంగ్లాలో ఏర్పాట్లు చేశారు. వేదికపై భారీ స్క్రీన్ ఏర్పాటు చేసి, ఫలితాలను తిలకించేందుకు కుర్చీలు వేశారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల నుంచి నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఉదయం ఇక్కడికి చేరుకోనున్నారు. మరోవైపు నియోజకవర్గ కేంద్రాల్లోనూ ఎక్కడికక్కడే టిడిపి నాయకులు ఏర్పాట్లు చేశారు. ఎగ్జిట్‌పోల్స్‌లో ఎక్కువ సర్వేలు టిడిపి అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పిన నేపథ్యంలో ఆ కూటమి నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. విజయనగరం నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల ఫలితాలను వీక్షించేందుకు ఇక్కడ స్క్రీన్ ఏర్పాటు చేశారు.

వైసిపిలో గ్రూపులపోరు టిడిపికి లాభించేనా ?

- కోళ్ల వ్యతిరేక గ్రూపు ఓటు కడుబండికి పడిందా?
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే
- నేడు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

శృంగవరపుకోట నియోజకవర్గంలో ఈసారి సార్వత్రిక ఎన్నికలు రసవత్తరంగా సాగాయనే చెప్పాలి. టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థిగా కోళ్ల లలితకుమారి, వైసిపి అభ్యర్థిగా కడుబండి శ్రీనివాసరావు బరిలో నిలవగా, ఇండియా వేదిక నుంచి కాంగ్రెస్ కాంగ్రెస్ అభ్యర్థిగా గేదెల తిరుపతి పోటీలో ఉన్నారు. నవరత్నాలలో భాగంగా ప్రజలకు చేసిన మంచే తనను గెలిపిస్తుందని వైసిపి అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావు ధీమా వ్యక్తంచేస్తున్నారు. వైసిపి ప్రభుత్వంపై ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారని, టిడిపి సూపర్ సిక్స్ పథకాలు తమను గెలిపిస్తాయని టిడిపి అభ్యర్థి కోళ్ల లలితకుమారి చెప్పారు. ఇలా ఎవరి ధీమాలో వారు ఉన్నారు. చివరికి వారి భవితవ్యం తేల్చే రోజు రానే వచ్చింది. మరికొన్ని గంటల్లో కోటలో పాగా వేసేది ఎవరో తేలిపోనుంది.

ఎస్.కోట మండలమే కీలకం

ఎమ్మెల్యే ఎన్నికల్లో శృంగవరపుకోట మండలం కీలకం కానుంది. ఈ మండలం ఓట్ల లెక్కింపులో ఏ పార్టీకి మెజార్టీ ఉంటే అదే పార్టీ కచ్చితంగా గెలుస్తుందనే నానుడు ఉంది.

సంక్షేమ పథకాలపై వైసిపి ధీమా

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలలో భాగంగా ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలే మరో మారు వైసిపి విజయానికి దోహద పడతాయని వైసిపి శ్రేణులు భావిస్తున్నాయి. టిడిపి అభ్యర్థి కోళ్ల లలితకుమారిపై వ్యతిరేకంగా ఉన్న వారు ఎమ్మెల్యే ఓటు వైసిపికి వేశారనే ప్రచారం కొన్ని మండలాల్లో గట్టిగా వినిపిస్తోంది. దీనికి తోడు వేపాడ మండలం వైసిపికి అనుకూలంగా పని చేసిందనే ప్రచారం జోరుగా సాగింది. దీంతో వైసిపి శ్రేణులు గెలుపు ధీమాతో ఉన్నాయి.

ప్రభుత్వ వ్యతిరేకతపై ఆశలు

నియోజకవర్గంలో ప్రజలు వైసిపి ప్రభుత్వంపై విసిగిపోయి ఉన్నారని, మార్పు కోరుకుంటున్నారని టిడిపి శ్రేణులు అభిప్రాయ పడుతున్నాయి. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు నియోజకవర్గానికి ఇచ్చిన హామీలను విస్మరించడం తమకు లాభిస్తుందని చెబుతున్నాయి. ఇవే కాకుండా ఎమ్మెల్సీ రఘురాజు భార్య సుధారాజు టిడిపిలో చేరడంతోపాటు రఘురాజు లోపాయికారకంగా పనిచేశారనే ప్రచారమూ ఉంది. ఇవి టిడిపికి బాగా కలిసి వస్తాయని, గెలుపు తెచ్చి పెడతాయనే ధీమాలో తెలుగు తమ్ముళ్లు ఉన్నారు. ఏదేమైనా మరికొన్ని గంటలలో కోటలో పాగా వేసేది ఎవరో తేలనుంది.

నువ్వా? నేనా?

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి నియోజకవర్గంలో విజయావకాశాలపై వైసిపి, టిడిపి అభ్యర్థులు ఎవరికి వారే ధీమాగా ఉన్నారు. వైసిపి అభ్యర్థిగా శంబంగి వెంకట చినప్పలనాయుడు, టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థిగా బేబినాయన పోటీ చేశారు. 10 వేల ఓట్లకు పైగా మెజారిటీతో విజయం సాధిస్తామని టిడిపి నాయకులు చెబుతుండగా, 3 వేల నుంచి 5 వేల ఓట్ల మెజారిటీతో మరోసారి గెలుస్తామని వైసిపి శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. విజయం ఎవరిని వరిస్తుందోనని నియోజకవర్గ ప్రజలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. కొన్ని గంటల్లో ఫలితం తేలనుంది.

2019లో విజయం సాధించిన ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు మరోసారి విజయం సాధించడం ఖాయమనే ధీమాతో ఉన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ పథకాలు మంజూరు చేయడం, ఇంటింటికీ పింఛన్లు అందించడంతో మహిళా ఓటర్లు, పింఛనుదారులు వైసిపి వైపు మొగ్గు చూపారని అధికార పార్టీ కేడర్ ఆశతో ఉంది. గత నెల 13న జరిగిన ఎన్నికల్లో సంక్షేమ పథకాలు తీసుకున్న ప్రతిఒక్కరూ వైసిపికి ఓటు వేశారని ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి కుంటు పడిందని, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని, ప్రభుత్వ వ్యతిరేక ఓటు తమను గెలిపిస్తుందని టిడిపి కేడర్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఎవరు విజయం సాధిస్తారో మరికొన్ని గంటల్లో తేలిపోనుంది.

సంబరాలకు సిద్ధంకండి

కార్యకర్తలకు పిలుపునిచ్చిన నాగార్జున

ప్రజాశక్తి- చీపురుపల్లి

సార్వత్రిక ఎన్నికల మహా సంగ్రామంలో విజయం ఎన్‌డిఎ కూటమిదేనని, టిడిపి జనసేన, బిజెపి శ్రేణులు సంబరాలకు సిద్ధం కావాలని విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గం ఇంచార్జి కిమిడి నాగార్జున కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. చీపురుపల్లిలో తన నివాసంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎవరు ఎన్ని చెప్పినా రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వస్తుందని, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం తథ్యమని జోస్యం పలికారు. 95 శాతం సర్వేలు ఎన్‌డిఎ కూటమికి అనుకూలంగా చెప్పాయన్నారు. ప్రజలంతా కూటమికి పెద్ద ఎత్తున మద్దతు తెలిపారన్నారు. ఈనెల నాలుగో తేదీన ఎన్నికల ఫలితాలు విడుదలయ్యాక వైసిపి అరాచక పాలన అంతమై రాష్ట్ర ప్రజలకు మంచి రోజులు రానున్నాయన్నారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధితో పాటు పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. విజయనగరం పార్లమెంట్ పరిధిలో ఎమ్మెల్యే, ఎంపి స్థానాలన్నింటినీ కూటమి కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. ఓట్ల లెక్కింపు వేళ పార్లమెంట్ స్థానం పరిధిలో ఏజెంట్లు అంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికలు అధికారులు సూచించిన సమయానికి ముందే కౌంటింగ్ కేంద్రానికి ఏజెంట్లు చేరుకోవాలని నాగార్జున కోరారు

మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న శారద పరిశ్రమ ప్రతినిధులు

మొక్కలు నాటిన శారద యాజమాన్యం

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలోని కంటకాపల్లి, చినరావుపల్లి పంచాయతీల్లో శారద పరిశ్రమ యాజమాన్యం సోమవారం మొక్కలు నాటింది. సుమారు 400 మొక్కలు నాటారు. కంపెనీ హెచ్‌ఆర్ సీనియర్ జిఎం ప్రభాత్ మోహన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతో దోహదపడతాయని చెప్పారు. ప్రతిఒక్కరూ ఇంటి ముంగిట మొక్కలు నాటి, పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు మదిన అప్పలరాం, భూసాల దేవుడు, స్కూల్ హెచ్‌ఎం ముగడ రమణ, చినరావుపల్లి మాజీ సర్పంచ్ బొబ్బిలి రమణ, శారద కంపెనీ సీనియర్ జిఎం(ఎంఎం) అనంత కుమార్, సీనియర్ జిఎం (ఇఅండ్ఐ) శత్రుఘ్న సింగ్, సీనియర్ జిఎం (సివిల్) కె.విజయభాస్కర్, హెచ్‌ఆర్ డిజిఎం సన్యాసిరావు, హెచ్‌ఆర్ మేనేజర్ శంకరరావు, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

నైట్ హాల్ట్ బస్సు ప్రారంభం

గుమ్మలక్ష్మీపురం : ఏజెన్సీ ప్రజల సౌకర్యార్థం గుమ్మలక్ష్మీ పురంలో నైట్‌హాల్ట్ బస్సు సర్వీసులను అధికారులు ప్రారంభించారు. ప్రతిరోజు రాత్రి ఎనిమిది గంటలకు పార్వతీపురం ప్రారంభమై గుమ్మలక్ష్మీపురం రాత్రి 10.30 గంటలకు వచ్చి నైట్‌హాల్ట్ ఉంటుంది. తెల్లవారుజామున 5.20 గంటలకు గుమ్మలక్ష్మీపురం నుంచి తిరిగి పార్వతీపురం బయలుదేరి వెళుతుంది.

విద్యా కానుకపై డిఇఒ ఆరా

ప్రజాశక్తి- రేగిడి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది విద్యా సంవత్సరానికి ఒకటి నుంచి 10వ తరగతి విద్యార్థులకు వచ్చిన విద్యా కానుకలపై డిఇఒ ప్రేమ్ కుమార్ ఆరా తీశారు. ఈ మేరకు సోమవారం విద్యా కానుకల స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. ముందుగా స్టాక్ రిజిస్టర్ తనిఖీ చేశారు. 5,584 మంది విద్యార్థులకు బ్యాగులు, యూనిఫారం, నోటు పుస్తకాలు, బూట్లు సాక్షులు వంటి మరో మూడు విద్యా కానుకలు వచ్చిన వెంటనే వేరుచేసి ఆయా పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేయాలని ఎంఇఒ2 ఎరకయ్యకు సూచించారు. విద్యా కానుకలలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా కిట్లు అందజేయాలని సూచించారు. బాధ్యతగా విద్యా కానుకలు అందజేయాలని సూచించారు. డిఇఒతోపాటు ఎంఐఎస్ కోఆర్డినేటర్ కె శ్రీనివాసరావు, సిఆర్‌పిలు, ఐఆర్పిలు, ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

విద్యా కానుకల స్టాక్‌పాయింట్‌ను పరిశీలిస్తున్న డిఇఒ ప్రేమ్‌కుమార్

కాలుష్య నివారణకు కృషి చేయాలి

ఆశయ సంస్థ అధ్యక్షులు రెడ్డి రమణ

ప్రజాశక్తి- గరివిడి

కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆశయ సంస్థ అధ్యక్షులు రెడ్డి రమణ అన్నారు. మండలం లోని బాగువలస గ్రామం లో శివాలయం నుంచి ఆకులపేట వరకు సోమవారం ర్యాలీ చేపట్టారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాలుష్య నివారణ కోసం సైకిల్ పై ర్యాలీ నిర్వహించారు. ఆశయ యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆశయ సంస్థ అధ్యక్షులు రెడ్డి రమణ ఈ ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ జూన్ 3 తేదీన ప్రపంచ సైకిల్ దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయించింద న్నారు. సైక్లింగ్ వల్ల కలిగే ఉపయోగాలను అందరికీ తెలియజేయాలని ఉద్దేశ్యంతో కేవలం ఆరోగ్యానికే కాదు ప్రకృతికి కూడా ఇది మంచిదని చెప్పారు. సైకిల్ తొక్కడం వల్ల మన కండరాలకు వ్యాయామం అవుతుందని ఇంధన వినియోగాన్ని తగ్గించుకో వచ్చునని చెప్పారు. కార్యక్రమంలో సాయి, రవి, విద్యార్థులు ఆశయ సంస్థ సభ్యులు యువత పాల్గొన్నారు.

చిన్నారులతో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న రెడ్డి రమణ

మహారాజశ్రీ జిల్లా కన్స్యూమర్ ఫోరమ్ కోర్టు శ్రీకాకుళం.
C.C.NO. 109/2023

Between:- సనపల నర్సుబాయి --పిటిషనర్
And:-
1. బుడుమూరు తులసీరావు
2. సంపతిరావు శంకరరాజు
3. మురహరిరావు మణిశంకర్ అఖిల్ కుమార్
--రెస్పాండెంట్స్

To,
Opposite party No. 3:
మురహరిరావు మణిశంకర్ అఖిల్ కుమార్ S/o మురహరి రావు సుకుమార్, వయస్సు: 29 సం॥, ఫ్లాట్ నెం-1, ఎస్.ఎఫ్-1, విజయలక్ష్మి నగర్ కాలనీ, బజాజ్ షోరూమ్ వెనుక, విజయనగరం టౌన్ మరియు జిల్లా.

మీ పై మహారాజశ్రీ జిల్లా కన్స్యూమర్ ఫోరమ్ కోర్ట్ శ్రీకాకుళంలో మీ హాజరు కొరకు పిటిషనర్ తనకు రావలసిన సొమ్ము మరియు నష్టపరిహారం కోసం ఫైల్ చేసిన పైన పేర్కొన్న కేసులో **తేది 18-6-2024 కి వాయిదా వేయడం అయినది.** కావునా పై తేదిన ఉదయం 10:30 గం॥ లకు మీరు కోర్టుకు స్వయంగా గానీ లేదా అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరు కాని యెడల ఈ కేసులో మీకు ఎక్స్ పార్టీ చేసి, మీ పరోక్షంలో నిర్ణయించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

అన్నెపు సత్యనారాయణ
న్యాయవాది, శ్రీకాకుళం.
సెల్ నెం. 9440347646, 7989284650.

చదురుగుడి ఆదాయం రూ. 12.31 లక్షలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం పైడితల్లి అమ్మవారి దేవస్థానం చదురుగుడిలోని 9 హుండీలను సోమవారం దేవాదాయశాఖ సహాయ కమిషనర్ డివివి ప్రసాదరావు సమక్షంలో లెక్కించారు. 31రోజులకు గాను నగదు రూపంలో రూ.12,31,170, బంగారం 26 గ్రాముల 800 మిల్లీగ్రాములు, వెండి 285 గ్రాములు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఆలయ అర్చకులు, సిబ్బంది, కెనరా బ్యాంకు అధికారులు, పోలీస్ సిబ్బంది ఈ లెక్కింపులో పాల్గొన్నట్లు తెలిపారు. అయితే హుండీ లెక్కింపులో అనూహ్య సంఘటన చోటు చేసుకుంది. సోమవారం లెక్కించిన హుండీలో అమ్మవారికి మొక్కులు నిమ్మితం భక్తులు హుండీలో వేసిన బంగారం, వెండి వస్తువుల్లో చాలా శాతం నకిలీవని తేలింది. ఆలయ అధికారులు బంగారం, వెండి నాణ్యత చూడగా నకిలీ బంగారంగా తేలడంతో అధికారులు విస్మయం చెందారు. భక్తులు అమ్మవారి కోసం బంగారం, వెండి కొనుగోలు చేసేటప్పుడు అవి నిజమైనవా కాదా? అనేది నిర్ధారణ చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

నేరాలు ఘోరాలు

పిడుగుపాటుకు 8 గొర్రెలు మృతి

ప్రజాశక్తి - వంగర

మండలంలోని ఆదివారం రాత్రి పటు వర్ధనం గ్రామ సమీపంలో గొర్రెల మందపై పిడుగు పడటంతో గ్రామానికి చెందిన చిన్ని గంగులకు చెందిన 8 గొర్రెలు మృతి చెందాయి. దీంతో గొర్రెల యజమాని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. మృతి చెందిన గొర్రెలను పశు వైద్యాధికారి ఎం అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఎహెచ్‌ఎ మజ్జి ఉమా శంకర్ సోమవారం పరిశీలించి పోస్టుమార్టం నిర్వహించారు. నివేదికను జిల్లా అధికారులకు పంపిస్తామన్నారు.

మృతి చెందిన గొర్రెల వద్ద విచారంతో కాపరులు

చెరువులో పడి వ్యక్తి మృత్యువాత

ప్రజాశక్తి-వేపాడ

మండల కేంద్రమైన వేపాడకు చెందిన తమడన వెంకటరమణ(40) ప్రమాదవశాత్తు చెరులో పడి మరణించారు. ఆయన భార్య ఇందు ఫిర్యాదు మేరకు వల్లంపూడిపోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.మృతదేహాన్ని ఎస్.కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని జాతీయ రహదారిపై సర్వీస్ రహదారిలో మతిస్థిమితం లేని గుర్తుతెలియని వ్యక్తి సోమవారం మృతి చెందాడు. ఈ వ్యక్తి గత కొన్నాళ్ళ నుంచి మతిస్థిమితం లేక రోడ్డు పైన ఉన్న వస్తువులు ఏరుకుంటూ ఈ ప్రాంతంలోనే తిరుగుతుంటాడని స్థానికులు చెబుతున్నారు. దీనిపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.